ప్రభుత్వ బడులు బలోపేతం

6 నుంచి 19 వరకు బడిబాట
- అన్ని పాఠశాలల్లో ఏఐ విద్య
- కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు
- ఎంఈఓ మాధవరెడ్డి


పాఠశాలల కోసం అందజేస్తున్న పాఠ్య పుస్తకాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యారంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, భోజనం, కంప్యూటర్ విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. నూతన విద్య సంవత్సరానికి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించామని ఎంఈఓ మాధవరెడ్డి తెలిపారు. సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, కల్పిస్తున్న వసతుల గురించి తెలియజేశారు.

ఆరు నుంచి బడిబాట

రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం వచ్చే నెల 6 నుంచి ప్రారంభంకానుంది. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నదే ధ్యేయంతో ప్రతి గ్రామంలో బడిబాట ద్వారా తల్లిదండ్రులకుఅవగాహన కల్పించి పిల్లలను బడిలో చేర్పిస్తారు. 19 వరకు ఈ బడిబాట కార్యక్రమం అన్ని గ్రామాల్లో మహిళ సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీలు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కల్పించనున్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు

నూతన విద్య సంవత్సరం ప్రారంభం ముందే అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 2,370 మంది విద్యార్థులు ఉండగా వారందరికీ పుస్తకాలు వచ్చాయి. ఆయా పాఠశాలలకు పంపిణీ కూడా జరిగింది. అలాగే యూనిఫారాలు కూడా 6వ తేదీ నుంచి పాఠశాలలకు అందనున్నాయి.

కంప్యూటర్ ల్యాబ్‌లు

రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు 50 మంది విద్యార్థులు దాటిన పాఠశాలలో ఏఐ సాయంతో విద్యను అందించాలి. అందులో భాగంగా పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే చాట్లపల్లి, ఇటిక్యాల పాఠశాలల్లో ఏఐ విద్యను ప్రారంభించారు. త్వరలోనే మిగతా అన్ని పాఠశాలల్లోను ప్రారంభిస్తారు. ఇటిక్యాల పాఠశాలలో ఒకేషనల్ కోర్సులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆ పాఠశాలలను తెరిపిస్తాం

మండలంలోని నిర్మల్‌నగర్, రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడ్డాయి. ఈ విద్య సంవత్సరం ఆ రెండు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి వాటిని తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో పలుగుగడ్డ, వట్టిపల్లి, చాట్లపల్లి, బీజీవెంకటాపూర్, మందాపూర్ గ్రామాల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయించేందుకు ప్రయత్నిస్తున్నారు.

అక్షర్యాసులుగా తీర్చిదిద్దుతాం



గ్రామాల్లో 15 యేళ్ల నిండి చదువుకు దూరమైన వారి కోసం న్యూ ఇండియా ప్రోగ్రెస్(ఎన్ఐఎల్‌పీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మధ్యలో చదువుకు దూరమైన వారిని గుర్తిస్తారు. అందుకు మహిళా సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లను సమన్వయ పరుస్తారు. గుర్తించిన వారందరికీ ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ విద్య ద్వారా పదో తరగతి, ఇంటర్ కోర్సులలో విద్యను అందిస్తారు. నిరక్ష్యరాస్యులను అక్షర్యాసులుగా మార్చడానికి వాలంటరీలను కూడా నియమించడానికి చర్యలు చేపట్టారు.

– ఎంఈఓ మాధవరెడ్డి

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

ఏఓ శేషశయన, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి


రికార్డులు, విత్తనాలను తనిఖీ చేస్తున్న ఏఓ శేషశయన, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి శేషశయన హెచ్చరించారు. వర్గల్, గౌరారంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలను గురువారం వారు తనిఖీ చేశారు. వివిధ రికార్డులు, విత్తనాలు ఎరువులను పరిశీలించారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు, అమ్మితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు విడి విత్తనాలు కొనుగోలు చేయొద్దని, విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసిన రశీదులను భద్రపరచుకోవాలని సూచించారు. వారి వెంట గౌరారం ప్రొబేషనరీ ఎస్ఐ కీర్తిరాజు, సిబ్బంది ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు: సీఐ సైదా

గజ్వేల్‌రూరల్: తూప్రాన్ రోడ్డులోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి నాగరాజుతో కలిసి సీఐ సైదా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను విక్రయించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు చెందిన రశీదులను భద్రపరుకోవాలని సూచించారు.

రెండో విడత ప్రవేశాలు ప్రారంభం

గజ్వేల్‌రూరల్: బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో ప్రవేశం పొందిన విద్యార్థులు తెలియజేయాలని ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో వందశాతం సీట్లు భర్తీకాగా, మరో 60 సీట్ల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. రెండో విడత ప్రవేశాలు ప్రారంభం కానున్నాయని, ఆప్షన్ల కోసం 93964 21849, 99125 91007 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిబంధనలు తప్పనిసరి

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు రాజీవ్ రహదారిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వానాకాలం నేపథ్యంలో కార్లకు వైపర్లను సరి చూసుకోవాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడవద్దని చెప్పారు.

తొలి ఎంపీటీసీ విష్ణువర్ధన్‌రెడ్డి మృతి


విష్ణువర్ధన్‌రెడ్డి(ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేట తొలి ఎంపీటీసీ మొగుళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం మృతి చెందారు. రాష్ట్రంలో ఎంపీటీసీలకు తొలిసారిగా నిర్వహించిన ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆయన నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎంతో సేవ చేశారని కొనియాడారు.

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య


ప్రచారజాతలో మాట్లాడుతున్న వలీ అహ్మద్

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నేత షేక్ వలీ అహ్మద్

చేర్యాల(సిద్దిపేట)/హుస్నాబాద్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి నాణ్యమైన విద్య పొందాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్ పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రానికి వచ్చిన ప్రచార జాతలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెంచేందుకు 26 మండలాల్లో ఐదు రోజుల నుంచి బడిబాట ప్రచార జాత నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలాలు ఉన్నాయని చెప్పారు. అలాగే పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, వర్క్ బుక్కులు, యూనిఫారాలతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, నర్సింగరావు, ఆగంరెడ్డి, చంద్రయ్య, నాగేశ్వరరావు, నర్సయ్యపంతులు, ఎంఈఓ కిష్టయ్య, రిటైర్డ్ ఎంఈఓ రాములు, టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు యాదగిరి, ప్రశాంత్‌కుమార్, శివలింగం, కనకయ్య, రాజు, శ్రీనివాస్, గణేశ్‌రెడ్డి, రాజిరెడ్డి, సత్యనారాయణ, చంద్రమౌళి, విజయ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మోహన్ నాయక్, రవి నాయక్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎమ్మెల్యే పరామర్శ**

చేర్యాల(సిద్దిపేట): పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త, మాజీ వార్డు సభ్యుడు బొడ్డు వీరేశ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం వీరేశ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

◆ **టాస్క్‌ఫోర్స్ బృందం సమావేశం**

దుబ్బాకరూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కరశర్మ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్, ఎస్ఐ గంగరాజ్ పాల్గొన్నారు.

◆ **క్రీడలతో శారీరక దారుఢ్యం**

గజ్వేల్‌రూరల్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని బాలల సంక్షేమ సమితి జిల్లా కమిటీ సభ్యుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిన నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీ విశాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న హ్యాండ్ బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కోచ్ విశాల, క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ **శిక్షణ శిబిరం ముగింపు**

సిద్దిపేటజోన్: డ్యాన్సుపై కొనసాగుతున్న శిక్షణ తరగతులు 2న ముగిస్తుందని రాఘవ డ్యాన్సు అకాడమీ ప్రతినిధులు గిరి, ప్రసాద్, సాయి తేజ చెప్పారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 2న శిక్షణ పొందిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరుకానున్నారని, 500 మందితో ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

◆ **బాధిత కుటుంబానికి బీమా చెక్కు**

గజ్వేల్‌రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గజ్వేల్‌కు చెందిన సాయికుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులకు టాటా ఏఐఏ సంస్థ ప్రతినిధులు బీమా డబ్బులను జమచేశారు. ఆ సంస్థ ప్రతినిధి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాయికుమార్‌గౌడ్ జనవరిలో రూ.1.25 లక్షల టర్మ్‌పాలసీని తీసుకోగా, వచ్చిన రూ.1.90 కోట్లను గురువారం నామినీ ఖాతాలో జమచేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆదర్శ్, వీరాస్వామి, చంద్రశేఖర్, శ్రీకాంత్, ప్రసాద్, రమేశ్, రాజు, సిబ్బంది ఆంజనేయులు, విద్యాసాగర్, స్వామి పాల్గొన్నారు.

◆ **పీస్ కమిటీ సమావేశం**

కొముురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐలు రాజు, షేక్ మహబూబ్ సూచించారు. వివిధ గ్రామాల ముస్లిం పెద్దలు, బీజేపీ సభ్యులతో కలసి పోలీస్‌స్టేషన్లలో గురువారం పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. బక్రీద్ నేపథ్యంలో ముస్లింలు ఆవులను కొనుగులు చేస్తే రసీదు తీసుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, భిక్షపతి రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఐదు రోజుల జైలు**

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుపడిన ఒకరికి న్యాయమూర్తి కాంతారావు ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్టు వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇమాంబాద్‌కు చెందిన కొమ్ము మనోహర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుపడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్టు సీఐ తెలిపారు.

◆ **కార్యాలయాల ఏర్పాటుకు వినతి**

కొండపాక(గజ్వేల్): నూతనంగా ఏర్పడిన కుకునూరుపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో డీఆర్‌డీఓ జయదేవ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

క్లుప్తంగా

భువనగిరి ఎంపీ పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎంపీ చామల

కొమురవెల్లి(సిద్దిపేట): ఇటీవల పితృవియోగం పొందిన చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ కుటుంబ సభ్యులను భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని అయినాపూర్‌లో కృష్ణ తండ్రి నర్సయ్య అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఎంపీ వెంట పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, గంగుల అయిలయ్య, విజేందర్ తదితరులు ఉన్నారు.

అహల్యాబాయి సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న విజయ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అహల్యాబాయి హోల్కర్ చేసిన సేవలు మరువలేనివని, ఆమె చూపిన మార్గంలో నడవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ పిలుపునిచ్చారు. అహల్యాబాయి 300వ జయంతి ఉత్సవాలను జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన ఆమె మాట్లాడుతూ అహల్యాబాయి చాలా ఆలయాలు, పాఠశాలలు నిర్మించారన్నారు. నేటి యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, ఉత్సవాల మెదక్ కన్వీనర్ సంతోష్‌కుమార్, వెంకట్, సంతోష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భూభారతిపై అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్ రహీం

మద్దూరు(హుస్నాబాద్): భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ గఫూర్ రహీం అన్నారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రెండో తేదీ నుంచి ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని తీసుకొస్తుందన్నారు. ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి


సమావేశంలో పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్: గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం, నిధులు కేటాయించాలని గౌడ సంఘం మహిళలు కోరారు. గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని కులాలకు కమ్యూనిటీ హాళ్లు ఉన్నాయని, గౌడ కులస్తులు ఏం పాపం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సభలు, సమావేశాలు నిర్వహించేందుకు కమ్యూనిటీ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మంత్రి పొన్నం చొరవ చూపి నిధులు కేటాయిస్తే సంతోషంగా బోనాల పండుగ చేస్తామని చెప్పారు. లేదంటే ఈ సంవత్సరం బోనాలకు దూరంగా ఉంటామన్నారు. సమావేశంలో రవీందర్‌గౌడ్, మహిళలు లక్ష్మి, సరోజన, శాంతవ్వ, రమ, హారిక, సృజన, మౌనిక, చంద్రకళ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గజ్వేల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టీపీటీఎఫ్ కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ అన్నారు. 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జోన్ కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంపు కోసం దృష్టి సారించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజులు, రామచంద్రం, ఎల్లయ్య, శంకర్, మల్లయ్య, నర్సింహులుగౌడ్, విద్యాసాగర్, సత్తయ్య, పోచం, నర్సయ్య, రాములు, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వీపీఓ వ్యవస్థను పటిష్టం చేయాలి

గజ్వేల్ ఏసీపీ నర్సింహులు


రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ నర్సింహులు

తొగుట(దుబ్బాక): గ్రామీణ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలిచ్చారు. అనంతరం మాట్లాడుతూ వారంలో మూడు సార్లు గ్రామాల్లో పర్యటించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని, గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అంకిత భావంతో విధులు నిర్వహించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని చెప్పారు. ప్రతి కేసును పారదర్శకంగా పరిశోధించాలని, కేడీలు, సస్పెక్ట్‌లు, రౌడీలపై నిఘా ముమ్మరంగా పెంచాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి


భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న శ్రీలత

వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలత

అక్కన్నపేట(హుస్నాబాద్): పంటలువేసే ముందు భూసార పరీక్షలు చేయించి, తగ్గిన పోషకాలను ఎరువుల రూపంలో వేసి అధిక దిగుబడులను పొందవచ్చనని మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత సూచించారు. మండలంలోని కుందన్వానిపల్లిలో గురువారం ఆమె భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూముల పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవాడానికి ఈ భూసార పరీక్షలు దోహదపడతాయన్నారు. వేసిన పంటకు నీళ్లలో తగిన నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు ఏ పోషకాలు తగ్గాయో ఈ పరీక్షల ద్వారా తెలుసుకుని వాటిని మాత్రమే అందించడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి శశిధర్


విలేకరులతో మాట్లాడుతున్న శశిధర్

కొండపాక(గజ్వేల్): పేదల సొంతింటి కల సాకారానికి చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్ కోరారు. మండల పరిధిలోని వెలికట్ట క్రాస్‌రోడ్డు వద్ద గురువారం పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి అప్పగించాలన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలిచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకుంటూ హామీలను పూర్తిస్థాయిలో నెరవేరేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, కనకాచారి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో రైతులకు మేలు


గజ్వేల్‌రూరల్: మాట్లాడుతున్న ఏడీఏ బాబునాయక్

ఏడీఏ బాబునాయక్

గజ్వేల్‌రూరల్: యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, అధిక దిగుబడులు పొందవచ్చని ఏడీఏ బాబునాయక్ పిలుపునిచ్చారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలువురు శాస్త్రవేత్తలు అహ్మదీపూర్, శేరుపల్లి, ధాతర్‌పల్లి గ్రామాల్లో గురువారం పర్యటించారు. రైతులకు పంటల సాగులో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించాలని, సేంద్రీయ ఎరువులను వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రోన్‌ల వినియోగం, అధిక దిగుబడినిచ్చే వరి, మొక్కజొన్న, పత్తి వంగడాలపై అవగాహన కల్పించారు. రైతులకు ఎఫ్‌పీఓ, పీఎం కిసాన్ యాప్‌ల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం, సీఆర్ఐడీఏ, ఎన్ఏఏఆర్ఎం శాస్త్రవేత్తలతో పాటు మండల వ్యవసాయాధికారి నాగరాజు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌పై అవగాహన

హుస్నాబాద్‌రూరల్: ఆయిల్‌పామ్ సాగుపై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు. పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి హాజరవుతారని చెప్పారు. ఉదయం 9.30కు జరిగే ఈ సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే రైతుల కలల సాకారం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేటరూరల్: రైతుల రుణాలను మాఫీ చేసి, వారి ఎన్నో యేళ్ల కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని రాఘవాపూర్ పెద్దచెరువు నుంచి బండలకుంటను నింపారు. రైతులు నిర్వహించిన జల హారతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రైతుల కోరిక మేరకు పెద్ద చెరువు నుంచి కుంటలోకి నీటిని విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని, దీనివల్ల సుమారు 500ల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు వెంకటి, మండల నాయకులు రాములు, అంజిరెడ్డి, సమియొద్దీన్, రమేశ్, మహిపాల్ రెడ్డి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీఐ దుర్గ

సీఐలు దుర్గ, వాసుదేవరావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు వారు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలన్నారు. ఆశ, భయం, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వ్యక్తిగత సమాచారం ఇతరులకు అందించవద్దని సూచించారు. మహిళలు, చిన్నారులు ఎలాంటి వేధింపులకు గురైనా డయల్ 100, 112, 1098, షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712667343కు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు

చేర్యాల(సిద్దిపేట): యువతీయువకులు తాత్కాలిక ఆనందం కోసం గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్ఐ నీరేష్ సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అరికట్టడంలో భాగంగా నార్కొటిక్స్ డాగ్స్‌తో పట్టణంలోని పలు కిరాణా, పాన్ షాపులు, హోటల్స్, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనించాలని, ఏదైనా అనుమానం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది అజయ్‌కుమార్, శ్యామ్‌సుందర్ రావు, చేర్యాల పోలీసులు పాల్గొన్నారు.